RNI: APTEL/2013/54506

# నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | ఆదివారం 9-8-2026 | సంచిక: 13 | సంఖ్య: 311 పేజీలు: 8 | వెల: 5/- | ఎడిటర్: సందీప్ గౌడ్ వి

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక
నేటి ప్రసాదం తెలుగు దినపత్రికలో
పనిచేయుటకు
తెలుగు రాష్ట్రాల్లో
విలేకరులు కావలెను.
అర్హతలు:
- పత్రికారంగంలో అసక్తి కలిగి ఉండాలి.
- తెలుగు భాషపై పట్టు ఉండాలి.
- రిపోర్టింగ్ అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం.
- స్థానిక సంఘటనలు వెలికితీసే అవగాహనం ఉండాలి.
- సమాజ సేవ చేయగల ఉత్తహం ఉండాలి.
- అనుభవం లేనివారికి శిక్షణ ఇవ్వబడును.
వివరాలకు సంప్రదించండి:
+91 90004 05386

## సాగునీటి ప్రాజెక్టులకు భారీ నిధులు..



రూ.5 వేల కోట్లు మంజూరు!

భూసేకరణ, పునరావాసం కోసం రూ.5 వేల కోట్లు మంజూరు చేశాం: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి అత్యధిక ప్రాధాన్యం

పత్తిపాకతో కొత్తగా 10 వేల ఎకరాలకు సాగునీరు

హైదరాబాద్, ఆగస్టు 8 : సాగునీటి ప్రాజెక్టుల పనులకు నిధుల కొరత అడ్డంకిగా మారకూడదనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. భూసేకరణ, పునరావాసం, పునరావాస చర్యల (R&R) కోసం రూ.5 వేల కోట్ల నిధులు మంజూరు

2లో



## కాంగ్రెస్‌పై కేటీఆర్ ఘాటు విమర్శలు..

కేసీఆర్ చేసినన్ని యాగాలు దేశంలో ఎవరూ చేసి ఉండరు: కేటీఆర్

ముఖ్యమంత్రి రేవంత్‌కు వ్యవసాయంపై అవగాహన శూన్యమన్న కేటీఆర్

నీటి హక్కుల పరిరక్షణ కోసం మరో ఉద్యమానికి సిద్ధమన్న కేటీఆర్

24 గంటల కరెంటు ఇస్తున్నట్లు నిరూపించాలని సవాల్

ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్‌ఎస్ తీవ్ర పోరాటం చేస్తుందని వెల్లడి

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ నిర్వహించినన్ని యాగాలు దేశంలో మరెవరూ చేసి ఉండరని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, దైవబలం సిద్ధించాలంటే ముందుగా మానవ ప్రయత్నం ఉండాలని, యాగాలు నిర్వహిస్తూనే ప్రభుత్వాలు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నేతలు చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని కేటీఆర్

## నేనేం బాబా బాగేశ్వర్‌ను కాదు, కానీ..!:

విద్యార్థులను నవ్వించిన ప్రధాని మోదీ

ఐఐటీ ఢిల్లీ స్నాతకోత్సవంలో బాబా బాగేశ్వర్ పేరును ప్రస్తావించిన ప్రధాని

డిగ్రీలతో పాటు దేశం కోసం ఏదైనా చేయాలనే కలను మోసుకెళ్తున్నారన్న మోదీ

3,000 మందికి పైగా విద్యార్థులకు డిగ్రీల ప్రదానం, ప్రతిభావంతులకు పురస్కారాలు

ప్రతిభావంతులైన విద్యార్థినుల సంఖ్య పెరగాలంటూ సరదాగా వ్యాఖ్య



ప్రధాని నరేంద్ర మోదీ నేడు ఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) స్నాతకోత్సవంలో పాల్గొన్నారు.

2లో

## రేపు పెద్ది సుదర్శన్ రెడ్డి ఇంటికి వెళ్లనున్న కేసీఆర్

పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి కేసీఆర్ భారీ చేయూత.. రూ.2.25 కోట్ల సాయం

పెద్ది సుదర్శన్ రెడ్డి స్వగ్రామం నల్లబెల్లికి వెళ్లనున్న కేసీఆర్

ఇద్దరు పిల్లల కోసం చెరో రూ.కోటి.. తల్లి అమృతమ్మకు రూ.25 లక్షలు

మొత్తం రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం అందించాలని బీఆర్ఎస్ నిర్ణయం

చదువు, భవిష్యత్‌తో పాటు కుటుంబ సంక్షేమ బాధ్యత కూడా పార్టీదేనని హామీ

## ఢిల్లీ పోలీసుల్లా ప్రవర్తించొద్దు..

తన భద్రతా అధికారిపై అభిజీత్ దీప్కే ఆగ్రహం

తన భద్రతా సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసిన అభిజీత్ డిప్కే

అతిథులను కలవకుండా ఎస్ఐ అడ్డుకుంటున్నారని ఆరోపణ



ఢిల్లీ పోలీసుల్లా ప్రవర్తించొద్దంటూ అధికారిపై ఫైర్

అతడిని విధుల నుంచి తొలగించాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదు

2లో



2లో

## వివేకా హత్య వెనుక కచ్చితంగా పెద్ద కుట్ర ఉంది

రాష్ట్రపతికి లేఖ రాసిన సునీత

వివేకా హత్య కేసులో న్యాయం కోసం రాష్ట్రపతికి కుమార్తె సునీత లేఖ

ఏడేళ్లు దాటినా పూర్తిస్థాయి న్యాయం జరగలేదని ఆవేదన

హత్య వెనుక భారీ కుట్ర, మనీ ట్రయల్‌పై సమగ్ర విచారణకు విజ్ఞప్తి

హత్య వార్త జగన్‌కు ముందుగా ఎలా తెలిసిందో తేల్చాలని అభ్యర్థన

ప్రధాని, ఏపీ, తెలంగాణ సీఎంలకు కూడా లేఖ ప్రతులు

## ఇంటింటా జాతీయ జెండా..

దేశ నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యానికి సీఎం చంద్రబాబు పిలుపు

ఏపీలో 'పార్టనర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్' కార్యక్రమానికి శ్రీకారం

ఆగస్టు 13 నుంచి 15 వరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరేయాలని పిలుపు

2047 నాటికి స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ సాధనే లక్ష్యం

ప్రజలు లబ్ధిదారులుగా కాకుండా దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్న సీఎం

యువత, విద్యార్థులను భాగస్వామ్యం చేస్తూ దీన్ని ప్రజా ఉద్యమంగా మార్చాలని ఆదేశం



దేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్‌లో 'పార్టనర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్' అనే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. 2047 నాటికి వికసిత్ భారత్, స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యాలను సాధించేందుకు ప్రతి పౌరుడూ తన వంతు పాత్ర పోషించేలా ఈ కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దాలని ఆయన దిశానిర్దేశం చేశారు. శనివారం అమరావతిలోని క్యాంప్ కార్యాలయంలో ఈ కార్యక్రమ రూపకల్పనపై ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా



## ద్రోహులను కలిసేందుకు ప్రధాని మోదీకి టైముంటుంది: ఉద్ధవ్ ఠాక్రే ఆగ్రహం

షిండే వర్గం ఎంపీలతో ప్రధాని మోదీ భేటీపై ఉద్ధవ్ థాకరే ఆగ్రహం

యువతను కాదని ద్రోహులతో సమావేశమయ్యారని విమర్శ

సుప్రీంకోర్టును భయపెట్టేందుకే ఈ భేటీ అని తీవ్ర ఆరోపణ

దేశంలో తుఫానుకు ముందున్న ప్రశాంతత నెలకొందన్న ఉద్ధవ్

యువత నిరసనలతో ప్రభుత్వంలో వణుకు పుట్టిందని వ్యాఖ్య

2లో

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక

# రేపు పెద్ది సుదర్శన్ రెడ్డి ఇంటికి వెళ్లనున్న కేసీఆర్





హైదరాబాద్, ఆగస్టు 08: నర్సంపేట మాజీ ఎమ్మెల్యే దివంగత నేత పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ ఆర్థిక సాయం ప్రకటించింది. పార్టీ నేతలతో చర్చించిన అనంతరం పెద్ది కుటుంబానికి రూ.2.25 కోట్లు అందించాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్ణయించారు. ఆదివారం నాడు పెద్ది సుదర్శన్ రెడ్డి స్వగ్రామం నర్సంపేట నియోజకవర్గంలోని నల్లబెల్లికి వెళ్లనున్న కేసీఆర్.. ఆ కుటుంబానికి ధైర్యం చెప్పనున్నారు. ప్రకటించిన ఆర్థిక సాయాన్ని అందజేయనున్నారు పిల్లల భవిష్యత్తు బాధ్యత ఇక తమదేనంటూ దివంగత నేత పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ భరోసా ఇచ్చారు. వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు పార్టీ తరఫున రూ.2.25 కోట్ల సాయం అందించాలని నిర్ణయించారు. ఇందులో ఆయన ఇద్దరు పిల్లలకు చెరో రూ.కోటి చొప్పున, వారి తల్లి అమృతమ్మ బాగోగుల కోసం మరో రూ.25 లక్షలు కేటాయించారు. ఈక్రమంలో పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ పరిస్థితిపై పార్టీ సీనియర్లు, వరంగల్ జిల్లా ముఖ్య నేతలతో కేసీఆర్ చర్చించారు. కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందించడంతో పాటు పిల్లల చదువు, భవిష్యత్ అవసరాలను పార్టీ పర్యవేక్షించాలని నిర్ణయించారు. దశదినకర్మ కార్యక్రమాలు పూర్తయిన అనంతరం వరంగల్ జిల్లా పార్టీ ముఖ్య నేతలు సమావేశమై కుటుంబ సంక్షేమానికి సంబంధించి మరిన్ని చర్యలు చేపట్టనున్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి ఎల్లవేళలా పార్టీ అండగా ఉంటుందని కేసీఆర్ స్పష్టం చేసినట్లు బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి.

### వివేకా హత్య వెనుక కచ్చితంగా

## పెద్ద కుట్ర ఉంది

మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించి ఆయన కుమార్తె డాక్టర్ వైఎస్ సునీతా రెడ్డి, భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖ రాశారు. తన తండ్రి హత్యకు గురై ఏడేళ్లకు పైగా గడిచినా తమ కుటుంబానికి ఇంతవరకు పూర్తి న్యాయం జరగలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. వివేకా హత్య వెనుక కచ్చితంగా పెద్ద కుట్ర ఉందని ఉద్ఘాటించారు. కేసు దర్యాప్తులో వెలుగు చూడని అనేక కీలక అంశాలను వెలికితీయాలని, నిందితులకు కఠిన శిక్ష పడేలా చూడాలని ఆమె తన లేఖలో కోరారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటివరకు జరిగిన సీబీఐ దర్యాప్తు, తదనంతర పరిణామాలను సునీత తన లేఖలో రాష్ట్రపతికి వివరించారు. హత్య జరిగి ఇన్నేళ్లయినా నేటికీ హత్యకు ఉపయోగించిన ఆయుధాన్ని స్వాధీనం చేసుకోలేకపోవడంపై ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. హత్య వెనుక ఉన్న పెద్ద కుట్రను, కోట్లాది రూపాయల ఆర్థిక లావాదేవీల కోణాన్ని సమగ్రంగా విచారించాలని డిమాండ్ చేశారు. దర్యాప్తులో కొన్ని కీలకమైన అంశాలు అపరిష్కృతంగానే మిగిలిపోయాయని ఆమె పేర్కొన్నారు. ఈ మేరకు దిశ, ఈనాడు పత్రికలు కథనాలు ప్రచురించాయి. ముఖ్యంగా, వివేకా హత్య వార్త బయటకు రాకముందే అప్పటి ప్రతిపక్ష నేత జగన్ కు ఎలా తెలిసిందనే అంశాన్ని లోతుగా దర్యాప్తు చేయాలని సునీత కోరారు. ఈ విషయంలో జగన్ పాత్రపై విచారణ జరపాల్సి ఉందని 2023 మే 25న సీబీఐ స్వయంగా హైకోర్టులో దాఖలు చేసిన అదనపు అఫిడవిట్‌ను ఆమె తన లేఖలో ఉటంకించారు. ఈ కీలక అంశాన్ని ట్రయల్ కోర్టు పరిగణనలోకి తీసుకోలేదని ఆమె తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మూడు ప్రత్యేక దర్యాప్తు బృందాలను (సిట్) ఏర్పాటు చేసినా, ఆ తర్వాత సీబీఐ నాలుగు చార్జిషీట్లు దాఖలు చేసినా, కేసులో లోతైన దర్యాప్తు జరగలేదనే భావనను ఆమె వ్యక్తం చేశారు. తాను న్యాయస్థానాల విచారణలో జోక్యం చేసుకోవాలని కోరడం లేదని, దర్యాప్తులో ఇప్పటివరకు బయటకు రాని వాస్తవాలను వెలికితీయాలన్నదే తన ఉద్దేశమని సునీత స్పష్టం చేశారు. ఈ కేసు దర్యాప్తును డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డీఓపీటీ) లేదా కేంద్ర హోం మంత్రిత్వ శాఖలోని అధికారికి బదిలీ చేయాలని అభ్యర్థించారు. నిర్ణీత కాలపరిమితిలో దర్యాప్తును సంతృప్తికరంగా ముగించి, వాస్తవాలను నిగ్గు తేల్చాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రపతితో పాటు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం, న్యాయ శాఖ మంత్రులు, ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డిలకు కూడా ఆమె ఈ లేఖ ప్రతులను పంపారు. ఏడేళ్లుగా న్యాయం కోసం ఎదురుచూస్తున్నామని, ఇకనైనా తమకు న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నట్లు సునీత తన లేఖలో పేర్కొన్నారు.

## ఢిల్లీ పోలీసుల్లా ప్రవర్తించొద్దు..

కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తన నివాసం వద్ద భద్రతా విధుల్లో ఉన్న ఓ పోలీస్ సబ్-ఇన్‌స్పెక్టర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తనను కలిసేందుకు వచ్చే సందర్శకుల పట్ల సదరు అధికారి దురుసుగా ప్రవర్తిస్తున్నారని, వారిని అడ్డుకుంటున్నారని ఆరోపిస్తూ వెంటనే అతడిని విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో శుక్రవారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నీట్ పేపర్ లీక్ వంటి విద్యార్థి సమస్యలపై పోరాటం ద్వారా 30 ఏళ్ల అభిజీత్ దీప్కే ప్రాచుర్యంలోకి వచ్చారు. ఆయనకు, ఆయన కుటుంబ సభ్యులకు ఆన్‌లైన్‌లో బెదిరింపులు రావడంతో వాలుజ్ ఎంఐడీసీ ప్రాంతంలోని ఆయన నివాసం వద్ద పోలీసులు భద్రత ఏర్పాటు చేశారు. అయితే, మఫ్టీలో ఉన్న సురేశ్ అనే ఎస్ఐ తనను కలిసేందుకు వచ్చే వారిని లోపలికి రానీయకుండా ఆటంకం కలిగిస్తున్నారని దీప్కే ఆరోపించారు. వైరల్ అవుతున్న ఓ వీడియోలో అభిజీత్ దీప్కే సదరు ఎస్ఐని నిలదీస్తూ,"నేను రమ్మని పిలుస్తున్నప్పుడు ప్రజలను అనుమతించడానికి మీకేంటి ఇబ్బంది? ఢిల్లీ పోలీసుల్లా ఎందుకు ప్రవర్తిస్తున్నారు? ఇప్పటివరకు ఎలాంటి సమస్యా తలెత్తలేదు, మిమ్మల్ని ఇప్పుడే మొదటిసారి చూస్తున్నాను. నేను ఎవరిని కలవాలి, ఎవరిని కలవకూడదు అనేది మీరు నిర్ణయించలేరు. దయచేసి ఇక్కడి నుంచి వెళ్ళిపోండి, మీరు నా ఇంట్లో ఉండాల్సిన అవసరం లేదు" అని ఆగ్రహం వ్యక్తం చేయడం కనిపించింది. మరో వీడియోలో ఆయన ఓ ఉన్నతాధికారితో ఫోన్‌లో మాట్లాడుతూ, "సురేశ్ అనే ఎస్ఐ ఇక్కడ చాలా దురుసుగా ప్రవర్తిస్తున్నారు. ఉద్దేశపూర్వకంగానే ఇలా చేస్తున్నారా? ఆయన నాకు వద్దు, వెంటనే ఇక్కడి నుంచి తొలగించండి" అని కోరారు. అంతేకాకుండా, రాష్ట్ర సీఐడీకి చెందిన సిబ్బంది మఫ్టీలో తన ఇంటి పరిసరాల్లో ఉంటూ 'హిట్ స్ప్రే' అనే వాట్సాప్ గ్రూప్ ద్వారా సమాచారాన్ని చేరవేస్తున్నారని దీప్కే ఆరోపించారు. ఓ విలేకరి ఒక అధికారి ఫోన్‌లో ఈ గ్రూప్‌ను గమనించారని ఆయన పేర్కొన్నారు.

## ప్రాజెక్టులపై మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదు..

- కాల్వలు తవ్వకుండానే అంకితమిచ్చారు: జూపల్లి
- పాలమూరు-రంగారెడ్డి పూర్తికాకుండానే జాతికి అంకితం చేశారని మండిపాటు

తెలంగాణ తాగు, సాగునీటి ప్రాజెక్టులపై మాట్లాడే కనీస అర్హత కూడా బీఆర్ఎస్ నాయకులకు లేదని మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే బీఆర్ఎస్ ప్రాజెక్టుల అంశాన్ని తెరపైకి తెస్తోందని ఆరోపించారు. జూరాలలో ఉన్న ప్రసుత నీటిమట్టంతో మొత్తం ఆయకట్టుకు నీరు అందించడం అసాధ్యమని ఆయన స్పష్టం చేశారు. ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందని తెలిపారు. పదేళ్ల పాలనలో పాలమూరు ప్రాజెక్టులను బీఆర్ఎస్ పట్టించుకోలేదని మంత్రి మండిపడ్డారు. రూ.80 వేల కోట్లు పట్టే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై కేవలం రూ.19 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసి, కనీసం కాల్వలు కూడా తవ్వకుండానే జాతికి అంకితం ఇచ్చామని చెప్పుకోవడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 68.5 శాతం వాటా రావాల్సి ఉండగా... కేసీఆర్ హయాంలో తెలంగాణకు కేవలం 299 టీఎంసీలకు మాత్రమే కేటాయింపులు జరగ్గా... ఏపీకి 512 టీఎంసీలు దక్కేలా చేశారని మంత్రి మండిపడ్డారు.

## ఇంటింటా జాతీయ జెండా..



సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, స్వాతంత్ర్యం సిద్ధించి 80వ వసంతంలోకి అడుగుపెడుతున్న తరుణంలో, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా, దేశ నిర్మాణ స్ఫూర్తిని ప్రజల్లో రగిలించాలని సూచించారు. "ఆగస్టు 15 నుంచి 'పార్టనర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్' కార్యక్రమాన్ని ప్రారంభించాలి. ఇందులో భాగంగా ఆగస్టు 13 నుంచి 15 వరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసేలా ప్రజలను చైతన్యవంతం చేయాలి. 'మై నేషన్, నేషన్ ఫస్ట్' (నా దేశం, దేశమే ప్రథమం) అనే భావన ప్రతి ఒక్కరిలోనూ కలిగించాలి" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రజలు కేవలం ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారులుగా మిగిలిపోకుండా, రాష్ట్ర భవిష్యత్ నిర్మాణంలో కీలక భాగస్వాములుగా (స్టేక్‌హోల్డర్లు) మారాలని చంద్రబాబు ఆకాంక్షించారు. "రాష్ట్ర, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో యువత, విద్యార్థుల శక్తిసామర్థ్యాలను సద్వినియోగం చేసుకోవాలి. వారి ఆలోచనలకు, ఉత్సాహానికి సరైన వేదిక కల్పించాలి. గ్రామస్థాయి నుంచి నాయకత్వ లక్షణాలున్న వారిని ప్రోత్సహించాలి. ఒకప్పుడు గ్రామాల్లో ఉన్న స్వచ్ఛంద సేవా స్ఫూర్తిని పునరుద్ధరించడానికి ఈ కార్యక్రమం దోహదపడాలి" అని ఆయన వివరించారు. 2047 లక్ష్యాల సాధన దిశగా ఏటా సాధించిన ప్రగతిపై ప్రతి ఆగస్టు 15న నివేదికలు సమర్పించాలని సీఎం ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని ఒక ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా, ప్రజలందరి భాగస్వామ్యంతో ఒక ప్రజా ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, వంగలపూడి అనిత, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, పలువురు ఉన్నతాధికారులు, వివిధ జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

## నేనేం బాబా బాగేశ్వర్‌ను కాదు, కానీ..!:

ఈ సందర్భంగా ఆయన మధ్యప్రదేశ్‌కు చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక గురువు బాబా బాగేశ్వర్ (ధీరేంద్ర కృష్ణ శాస్త్రి) పేరును ప్రస్తావించి సభలో నవ్వులు పూయించారు. విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, వారి మనసులోని ఆలోచనలను సరదాగా ఊహించి చెప్పారు."మీరంతా ఈ రోజు ఇక్కడ సమావేశమయ్యారు. కానీ, మీ మనసుల్లో ఎన్నో ఆలోచనలు మెదులుతూ ఉంటాయి. నేనేం బాబా బాగేశ్వర్‌ను కాదు, కానీ మీ మదిలో ఏముందో ఊహించగలను. కొందరు భవిష్యత్తు గురించి, మరికొందరు జీతాల గురించి, ఇంకొందరు కొత్త నగరంలో కొత్త జీవితం గురించి, మరికొందరు స్టార్టప్‌ల గురించి ఆలోచిస్తుండవచ్చు" అని మోదీ వ్యాఖ్యానించడంతో విద్యార్థులు, అధ్యాపకులు చప్పట్లతో హర్షం వ్యక్తం చేశారు. ఈ వేడుకలో 3,000 మందికి పైగా విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. "ఈ రోజు మీ కుటుంబ సభ్యులు ఎంత గర్వపడుతున్నారో, నేను కూడా మీ గురించి అంతే గర్విస్తున్నాను. మీరు కేవలం డిగ్రీలు అందుకోవట్లేదు, దేశం కోసం ఏదైనా సాధించాలనే కలను ముందుకు తీసుకెళుతున్నారు" అని విద్యార్థులను అభినందించారు. ప్రతి ఒక్కరి మార్గం, కలలు వేర్వేరుగా ఉన్నప్పటికీ, ఐఐటీలో చేరిన మొదటి రోజు నుంచి ఈ స్నాతకోత్సవం వరకు సాగిన ప్రయాణం ప్రతి ఒక్కరిలో సంతృప్తిని నింపుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా అకడమిక్స్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రెసిడెంట్స్ గోల్డ్ మెడల్, డైరెక్టర్స్ గోల్డ్ మెడల్ వంటి ప్రతిష్ఠాత్మక పురస్కారాలను ప్రధాని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన సరదాగా స్పందిస్తూ.. "ప్రతిభావంతులైన విద్యార్థుల్లో కొంతమంది ఆడపిల్లలు ఉంటే బాగుండేది. క్షమించాలి, కొందరు కాదు, చాలామంది ఉండాలి" అని వ్యాఖ్యానించడంతో సభలో మరోసారి నవ్వులు విరిశాయి. అనంతరం ఐఐటీ సోనిపట్ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన 'పరం ప్రజ్ఞ' అనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత హై-పెర్ఫార్మెన్స్ సూపర్ కంప్యూటింగ్ కేంద్రాన్ని ప్రధాని వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సదుపాయం ఏఐ, డేటా సైన్స్, అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ రంగాల్లో ఐఐటీ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని భావిస్తున్నారు. జీవితంలో వెనక్కి తిరిగి చూసుకున్నప్పుడు క్యాంపస్ జీవితం, స్నేహితులు, గురువులు ఎప్పటికీ గుర్తుండిపోతారని మోదీ విద్యార్థులకు సూచించారు.

## కాంగ్రెస్‌పై కేటీఆర్ ఘాటు విమర్శలు..

విమర్శించారు. బీఆర్ఎస్ అగ్రనేత హరీశ్ రావు దేవాలయాలకు వెళ్లడాన్ని ఎగతాళి చేయడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వ్యవసాయం, రైతాంగ సమస్యలపై కనీస అవగాహన లేదని ఆయన ఆరోపించారు. పాలమూరు బిడ్డనని చెప్పుకునే ముఖ్యమంత్రి, ఆ జిల్లాకు సాగునీరు అందించడంలో పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు. రాష్ట్ర నీటి హక్కులను కాపాడటంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని తరలిస్తుంటే ఇక్కడి ప్రభుత్వం ఏం చేస్తోందని ఆయన ప్రశ్నించారు. గోదావరి బోర్డు సమావేశంపై ప్రభుత్వ తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. తాము అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా రాష్ట్ర శ్రేయస్సుకే ప్రాధాన్యతనిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎక్కడ 24 గంటల విద్యుత్తును నిరంతరాయంగా సరఫరా చేస్తున్నారో నిరూపించాలని ఆయన సవాల్ విసిరారు. 'హైడ్రా' పేరుతో పేదలపై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని ఆరోపించారు. నీటి హక్కుల పరిరక్షణ కోసం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ఉద్యమ తరహాలోనే మరో భారీ పోరాటానికి సిద్ధమవుతామని కేటీఆర్ హెచ్చరించారు.

## సాగునీటి ప్రాజెక్టులకు భారీ నిధులు..

చేసినట్లు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పెండింగ్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. సచివాలయంలో మీడియాతో మాట్లాడిన మంత్రి.. మిడ్‌మానేరు ఎడమ కాలువ పనులను వెంటనే పునఃప్రారంభిస్తామని తెలిపారు. పత్తిపాక రిజర్వాయర్‌ను ఫాస్ట్‌ట్రాక్‌లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. పత్తిపాక ప్రాజెక్టుతో కొత్తగా 10 వేల ఎకరాలకు సాగునీరు అందించనున్నట్లు ఉత్తమ్ వెల్లడించారు. ఆగస్టు నెలాఖరులోగా పత్తిపాక డీపీఆర్ సిద్ధం చేయాలని సూచించారు. 96 శాతం పూర్తైన రోళ్లవాగు ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి పెట్టామని, దాని ద్వారా చివరి ఆయకట్టులోని 15 వేల ఎకరాలకు నీరు అందించనున్నట్లు తెలిపారు. మొత్తం 2.40 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ లక్ష్యంగా పనులను వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. భూసేకరణ, టెండర్లు, అనుమతులను సమాంతరంగా పూర్తి చేసి, నిర్వాసితులకు పరిహారం, పునరావాస ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు.

## ద్రోహులను కలిసేందుకు ప్రధాని మోదీకి టైముంటుంది: ఉద్ధవ్ ఠాక్రే ఆగ్రహం

శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే, ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. దేశంలో ఆందోళనలు చేపడుతున్న యువత సమస్యలను పట్టించుకోని ప్రధాని, తమ పార్టీ నుంచి ఫిరాయించిన ద్రోహులతో సమావేశమయ్యేందుకు మాత్రం సమయం కేటాయించారని ఆయన ఆరోపించారు. శనివారం ముంబైలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉద్ధవ్ ఠాక్రే మాట్లాడుతూ, అంతకుముందు రోజు ఎన్డీయే కూటమితో జరిగిన బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ అనంతరం, ఏక్‌నాథ్ షిండే వర్గానికి చెందిన ఆరుగురు నూతన ఎంపీలతో ప్రధాని మోదీ భేటీ కావడాన్ని ప్రస్తావించారు. సుప్రీంకోర్టులో శివసేన వర్గాల పిటిషన్లపై విచారణ జరుగుతున్న తరుణంలో, న్యాయస్థానాన్ని భయపెట్టేందుకే ఈ భేటీని ఏర్పాటు చేశారా? అని ఆయన ప్రశ్నించారు."యువతను కలిసేందుకు ప్రధానమంత్రికి సమయం లేదు కానీ, ద్రోహులతో సమావేశమవుతారు. వారికి అండగా ఉంటామని భరోసా ఇస్తున్నారు. మీరు సుప్రీంకోర్టును భయపెట్టాలని చూస్తున్నారా?" అని ఉద్ధవ్ ఠాక్రే నిలదీశారు. సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగబద్ధంగానే వస్తుందన్న నమ్మకం తనకుందని ఆయన స్పష్టం చేశారు. దేశంలో ప్రస్తుతం 'తుపానుకు ముందు ప్రశాంతత' నెలకొందని ఉద్ధవ్ ఠాక్రే అభివర్ణించారు. జెన్ జీ నిరసనలు ప్రభుత్వాన్ని కదిలించాయని, అయితే వారికి మద్దతు ఇవ్వాల్సింది పోయి ప్రభుత్వం పోలీసు చర్యలకు పాల్పడుతోందని మండిపడ్డారు. పాలనలో మార్పుకు సమయం ఆసన్నమైందని, కేంద్ర ప్రభుత్వం కేవలం సోషల్ మీడియా వేదికల ద్వారానే పాలన సాగిస్తోందని



# బోనాల వేళ పోలీసుల హెచ్చరిక..

## నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

**ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో బోనాలు నిర్వహించుకోవాలి: ఐడీఏ బొల్లారం సీఐ సుధీర్ కుమార్**

**భక్తుల భద్రతకు ప్రత్యేక పోలీసు బందోబస్తు**

**నిబంధనలకు విరుద్ధంగా డీజేలు వినియోగిస్తే చట్టపరమైన చర్యలు**

గుమ్మడిదల (బొల్లారం), ఆగస్టు 08 (నేటి ప్రస్థానం): సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం ఐడీఏ బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగే బోనాల పండుగను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఐడీఏ బొల్లారం సీఐ సుధీర్ కుమార్ సూచించారు. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. భక్తులు, నిర్వాహకులు పోలీసుల సూచనలు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సీఐ కోరారు. ముఖ్యంగా నిబంధనలకు విరుద్ధంగా డీజేలు వినియోగించడం, అధిక శబ్దంతో ప్రజలకు ఇబ్బందులు కలిగించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పండుగకు వచ్చే భక్తుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ పోలీసు సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నట్లు పేర్కొన్నారు. బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో నిర్వహించుకోవాలని సీఐ సుధీర్ కుమార్ కోరారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి పోలీస్ శాఖకు సహకరించాలని సూచించారు. పండుగ సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని స్పష్టం చేశారు.

# గుమ్మడిదలలో దుర్గమ్మ బోనాలు..

## భక్తులతో కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం

**దుర్గమ్మ తల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే జీఎంఆర్**

**తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాలు ప్రతీక: ఎమ్మెల్యే**

**భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పణ**





గుమ్మడిదల, ఆగస్టు 08 (నేటి ప్రస్థానం): గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలో దుర్గమ్మ తల్లి బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. బోనాల ఉత్సవాలకు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై దుర్గమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అమ్మవారి ఆశీస్సులతో గుమ్మడిదల ప్రాంత ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలంతా ఐక్యతతో ప్రశాంత వాతావరణంలో పండుగలను నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రాంత అభివృద్ధి, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుమార్‌గౌడ్, వైస్ చైర్మన్ సంధ్య గోవర్ధన్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు కత్తుల రమేష్, సరెడ్డిగారి పద్మ వెంకట్రాంరెడ్డి, సురభి కుమార్ గౌడ్, నాయకులు పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, ఉత్సవ నిర్వాహకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







# విద్యార్థి దశలోనే భవిష్యత్తుకు పునాది. :ఏసీపీ శంకర్ రెడ్డి

## ఇంటర్ రెండేళ్లు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు మీ సొంతం: మేడ్చల్ జోన్ ఏసీపీ శంకర్ రెడ్డి

## చదువుతో పాటు క్రమశిక్షణ, లక్ష్యసాధనపై దృష్టి పెట్టాలని సూచన





**మేడ్చల్, ఆగస్టు 08 (నేటి ప్రస్థానం):** పట్టుదల, క్రమశిక్షణతో ముందుకు సాగితే జీవితంలో ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని మేడ్చల్ జోన్ ఏసీపీ సీహెచ్. శంకర్ రెడ్డి అన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులు రెండేళ్ల పాటు చదువుపై పూర్తి స్థాయిలో దృష్టి సారిస్తే తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవచ్చని సూచించారు. మేడ్చల్ పట్టణంలోని స్ఫూర్తి జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ డే వేడుకలను శనివారం శ్రీ గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏసీపీ శంకర్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. జీవితంలో ముందుకు సాగాలంటే లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దాన్ని చేరుకునే వరకు నిరంతరం శ్రమించాలని సూచించారు. విద్యార్థి దశలో తీసుకునే నిర్ణయాలు భవిష్యత్తుపై ప్రభావం చూపుతాయని, అందువల్ల చదువుతో పాటు క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. తల్లిదండ్రులు, అధ్యాపకుల సూచనలను పాటిస్తూ విద్యలో రాణించాలని విద్యార్థులకు సూచించారు. ఇంటర్మీడియట్ రెండేళ్లను సద్వినియోగం చేసుకుంటే ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాల్లో మంచి ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన సామాజికవేత్త మంజులాదేవి మాట్లాడుతూ.. విద్యార్థులు తల్లిదండ్రులు, గురువుల మాటలను శ్రద్ధగా విని, మంచి మార్గంలో నడవాలని సూచించారు. ఇంటర్మీడియట్ దశ తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకునేందుకు ఎంతో కీలకమైన సమయమని పేర్కొన్నారు. ఫ్రెషర్స్ డే సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థుల నృత్యాలు, పాటలు, వివిధ కళా ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఎస్ఐ భానుచందర్ గౌడ్, కళాశాల యాజమాన్య సభ్యులు మంజుల ప్రకాష్, కమలాకర్ రెడ్డి, దేవరాజ్, గణేష్, రామ్ శంకర్, సత్యనారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# వీరభద్రస్వామి సన్నిధిలో డీపీఆర్ఓ దంపతుల ప్రత్యేక పూజలు



**భద్రకాళి సమేత వీరభద్రస్వామిని దర్శించుకున్న విజయలక్ష్మి దంపతులు**

**వేదమంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు.. శాలువాలతో సత్కరించిన ఆలయ నిర్వాహకులు**

**గుమ్మడిదల, ఆగస్టు 08 (నేటి ప్రస్థానం):** గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి వీరన్నగూడెం 10వ వార్డులోని శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో జిల్లా డీపీఆర్ఓ విజయలక్ష్మి, ఆమె భర్త అవినందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దంపతులకు ఆలయ నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు. వేదమంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆలయ అర్చకులు.. తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయ కార్యనిర్వహణ అధికారి రాంబ్రహ్మాచారి, మాజీ టెంపుల్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ నిర్వాహకులు విజయలక్ష్మి, అవినందర్‌రెడ్డి దంపతులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాంబ్రహ్మాచారి మాట్లాడుతూ వీరభద్రస్వామివారి ఆశీస్సులు జిల్లా ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో జీవించాలని, ఈ ప్రాంతం సుభిక్షంగా అభివృద్ధి చెందాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. డీపీఆర్ఓ విజయలక్ష్మి మాట్లాడుతూ వీరభద్రస్వామివారిని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. స్వామివారి ఆశీస్సులతో జిల్లా ప్రజలందరికీ మేలు కలగాలని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి రాంబ్రహ్మాచారి, మాజీ టెంపుల్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఆలయ నిర్వాహకులు, అర్చకులు, భక్తులు, స్థానిక ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.





**పోక్సో కేసు ఎఫెక్ట్:**

# పృథ్వీశ్వర్‌కు బిగ్ షాక్.. టీబీఏ నుంచి సస్పెన్షన్

**పోక్సో కేసు నేపథ్యంలో పృథ్వీశ్వర్‌ను టీబీఏ నుంచి సస్పెండ్**

**అత్యవసర సమావేశంలో నిర్ణయం.. బీఎఫ్ఐకి అసోసియేషన్ లేఖ**

**జనరల్ సెక్రటరీగా విష్ణు కుమార్ గౌడ్ నియామకం**

హైదరాబాద్, ఆగస్టు 08 (నేటి ప్రస్థానం): తెలంగాణ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పృథ్వీశ్వర్ రెడ్డిపై నమోదైన పోక్సో కేసు వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు నేపథ్యంలో పృథ్వీశ్వర్‌ను తెలంగాణ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ (టీబీఏ) సస్పెండ్ చేసింది. అత్యవసరంగా నిర్వహించిన అసోసియేషన్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. పృథ్వీశ్వర్‌పై తీసుకున్న చర్యలను తెలియజేస్తూ బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బీఎఫ్ఐ)కి టీబీఏ లేఖ పంపింది. అలాగే, ఇప్పటివరకు జాయింట్ సెక్రటరీగా కొనసాగుతున్న విష్ణు కుమార్ గౌడ్‌ను జనరల్ సెక్రటరీగా నియమించినట్లు అసోసియేషన్ ప్రకటించింది. ఇదిలా ఉండగా, పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న పృథ్వీశ్వర్‌ను పోలీసులు అరెస్ట్ చేయలేదని ఆరోపిస్తూ బాలిక తల్లిదండ్రులు రాష్ట్ర డీజీపీ, హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. కేసు నమోదైన అనంతరం స్టేషన్ బెయిల్ ఇవ్వడంపై కూడా వారు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. పృథ్వీశ్వర్‌ను వెంటనే అరెస్ట్ చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు ఫిర్యాదులో కోరినట్లు తెలుస్తోంది. బాస్కెట్‌బాల్‌లో మంచి భవిష్యత్తు ఉన్న క్రీడాకారిణిపై వేధింపుల ఆరోపణలు రావడంతో బాలిక తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతోందని తల్లిదండ్రులు ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. మరోవైపు, టీబీఏలో పృథ్వీశ్వర్ ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారనే ఆరోపణలు కూడా తెరపైకి వచ్చాయి. ఈ ఆరోపణలపై బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా విచారణ జరుపుతున్నట్లు సమాచారం.

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక

# బోనాల ఊరేగింపుపై పోలీసుల నజర్.. ఈసారి ఎలాంటి వివాదాలకు తావులేకుండా..!

### దోమడుగు గ్రామస్తులకు ఎస్ఐ అరుణ్ కుమార్ కౌన్సెలింగ్

### కుల, వ్యక్తిగత దూషణలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలకు దూరంగా ఉండాలని సూచన

### శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిక






**గుమ్మడిదల, ఆగస్టు 08 (నేటి ప్రస్థానం):** గతేడాది ఫలహారం బండి ఊరేగింపు సందర్భంగా వివాదం చోటుచేసుకున్న నేపథ్యంలో ఈసారి బోనాలు, ఫలహారం బండి ఊరేగింపులను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని దోమడుగు గ్రామస్తులకు గుమ్మడిదల ఎస్ఐ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. బోనాలు, ఫలహారం బండి ఊరేగింపులు గ్రామ సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విశ్వాసాలకు సంబంధించినవని, ప్రతి ఒక్కరూ పరస్పర గౌరవం, సంయమనంతో కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. గత ఏడాది ఘటనను దృష్టిలో ఉంచుకుని ఈసారి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఊరేగింపు సమయంలో కుల, వ్యక్తిగత దూషణలు చేయడం, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం, ఇతరుల మనోభావాలను దెబ్బతీసేలా ప్రవర్తించడం వంటి చర్యలకు పాల్పడవద్దని స్పష్టం చేశారు. చిన్నపాటి వివాదాలు సైతం పెద్ద సమస్యలకు దారితీయకుండా ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని కోరారు. ఫలహారం బండి ఊరేగింపు మార్గం, సమయం, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోలీసులకు సహకరించాల్సిన అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఏదైనా సమస్య తలెత్తితే స్వయంగా గొడవలకు దిగకుండా వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. పండుగలు ప్రజలను ఐక్యం చేసేలా ఉండాలని, కుల, వర్గ విభేదాలకు కారణం కాకూడదని ఎస్ఐ పేర్కొన్నారు. పోలీసుల సూచనలను పాటిస్తూ బోనాలు, ఫలహారం బండి ఊరేగింపులను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని గ్రామస్తులను కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.





# ఉదయ్ కృష్ణారెడ్డి కేసులో ట్విస్ట్..

### సూసైడ్ నోట్, ఐఫోన్ ఏమయ్యాయి? ప్రశ్నించిన సీపీ సజ్జనార్

### సూసైడ్ నోట్, ఐఫోన్ మిస్సింగ్‌పై పోలీసుల దృష్టి

### కస్టడీలో ఉదయ్ కృష్ణారెడ్డిని ప్రశ్నించిన సీపీ

### నోట్ ఎక్కడ ఉందన్న ప్రశ్నకు సమాధానం ఇవ్వలేదని సమాచారం

హైదరాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి కేసులో సూసైడ్ నోట్, ఐఫోన్ అదృశ్యంపై పోలీసులు దృష్టి సారించారు. ఈ కేసును హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. శనివారం కస్టడీలో ఉన్న ఉదయ్ కృష్ణారెడ్డిని సీపీ స్వయంగా విచారించినట్లు సమాచారం. సూసైడ్ నోట్‌లో తన వద్ద ఉన్న ఆధారాలన్నీ ఐఫోన్‌లో పొందుపరిచినట్లు ఉదయ్ కృష్ణారెడ్డి పేర్కొన్నట్లు పోలీసులు చెబుతున్నారు. అయితే ఆ సూసైడ్ నోట్, ఐఫోన్ ప్రస్తుతం కనిపించకపోవడంపై విచారణ కొనసాగుతోంది. నోట్‌లో పేర్కొన్న అంశాలపై సీపీ ప్రశ్నించగా.. తాను మద్యం మత్తులో ఆ నోట్ రాశానని ఉదయ్ కృష్ణారెడ్డి చెప్పినట్లు సమాచారం. ప్రస్తుతం ఆ నోట్ ఎక్కడ ఉందో తనకు తెలియదని చెప్పినట్లు తెలుస్తోంది. అసలు సూసైడ్ నోట్ ఎక్కడుంది? అది బయటకు ఎలా వచ్చింది? అనే ప్రశ్నలపై కూడా ఆయన నుంచి స్పష్టమైన సమాధానం రాలేదని పోలీసు వర్గాల సమాచారం.

# హైడ్రా ఉద్యోగాల కోసం వచ్చిన నిరుద్యోగులకు అవమానం.. రేవంత్ సర్కార్‌పై హరీశ్‌రావు ఆగ్రహం

### 150 డ్రైవర్ పోస్టుల కోసం వేలాదిగా తరలివచ్చిన నిరుద్యోగులు

### ఉద్యోగం అడగడం నేరమా? నిరుద్యోగులకు క్షమాపణ చెప్పాలని హరీశ్‌రావు డిమాండ్

### నిరుద్యోగులను అవమానించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



హైదరాబాద్, ఆగస్టు 08 (నేటి ప్రస్థానం): హైడ్రాలో 150 డ్రైవర్ పోస్టుల భర్తీ కోసం వచ్చిన నిరుద్యోగుల పట్ల అధికారులు అనుచితంగా వ్యవహరించారంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగం కోసం వచ్చిన యువతను అవమానించడం సరికాదని, నిరుద్యోగులను అవమానించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగాల కోసం వేలాది మంది యువత తరలిరావడం రాష్ట్రంలో నిరుద్యోగ పరిస్థితికి అద్దం పడుతోందని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఇచ్చిన హామీ ఏమైందని హరీశ్‌రావు ప్రశ్నించారు. ప్రభుత్వం ఏర్పడి 32 నెలలు దాటినా హామీ అమలు కాలేదని విమర్శించారు. రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేసి ఉంటే 150 డ్రైవర్ పోస్టుల కోసం వేలాది మంది క్యూలో నిలబడాల్సిన పరిస్థితి ఉండేదా అని ప్రశ్నించారు. ఉద్యోగం అడగడం నేరం కాదని, ప్రభుత్వాన్ని ప్రశ్నించడం తప్పు కాదని పేర్కొంటూ.. నిరుద్యోగులను అవమానించినందుకు ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## రూ.58 లక్షల ఫ్లాట్.. కేవలం రూ.6 లక్షలకే..

# ఇందిరమ్మ ఇళ్లకు భారీ డిమాండ్

### 7,340 ఫ్లాట్లకు ఏకంగా 35,125 దరఖాస్తులు

### ఆగస్టు 10 వరకు దరఖాస్తులకు అవకాశం.. 20 తర్వాత లాటరీ

### ఇల్లు దక్కకపోతే రూ.10 వేల డిపాజిట్ పూర్తిగా తిరిగి చెల్లింపు




**హైదరాబాద్, ఆగస్టు 08 (నేటి ప్రస్థానం):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ పథకానికి లబ్ధిదారుల నుంచి భారీ స్పందన లభించింది. మార్కెట్‌లో రూ.30 లక్షల నుంచి రూ.58 లక్షల వరకు విలువ చేసే ఫ్లాట్లను కేవలం రూ.6 లక్షలకే అందించనున్న నేపథ్యంలో.. 7,340 ఇళ్ల కోసం ఇప్పటివరకు ఏకంగా 35,125 దరఖాస్తులు వచ్చాయి. దీంతో ఒక్కో ఫ్లాట్‌కు సగటున నాలుగు నుంచి ఐదు దరఖాస్తులు పోటీ పడుతున్నాయి. ప్రభుత్వం ఈ దరఖాస్తుల స్వీకరణకు ఆగస్టు 10 వరకు గడువు విధించింది. దరఖాస్తుల పరిశీలన అనంతరం ఆగస్టు 20 తర్వాత లాటరీ పద్ధతిలో అర్హులైన లబ్ధిదారులకు ఫ్లాట్లను కేటాయించనుంది. లాటరీలో ఇల్లు దక్కని దరఖాస్తుదారులకు వారు చెల్లించిన రూ.10 వేల డిపాజిట్‌ను ప్రభుత్వం పూర్తిగా తిరిగి చెల్లించనుంది. ఇక దరఖాస్తు ప్రక్రియను సులభతరం చేస్తూ కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు లేకుండానే దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. ప్రస్తుతం రాష్ట్రంలోని 16 నియోజకవర్గాల్లో 7,340 ఫ్లాట్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఈ ఏడాదిలోగా నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్లను అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్రవ్యాప్తంగా లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టే దిశగా ప్రభుత్వం చర్యలు వేగవంతం చేస్తోంది.

# అరుణాచల్‌పై చైనా కుట్రలకు చెక్

### అరుణాచల్ మ్యాప్‌ను విడుదల చేసిన భారత్

భారత్‌లోని అరుణాచల్ ప్రదేశ్‌లో పలు ప్రాంతాలను తమవిగా చెప్పుకునే చైనాకు భారత్ గట్టి కౌంటర్ ఇచ్చింది. ఆ రాష్ట్రంలోని నాలుగు మౌంటెయిన్ పాస్‌లు, ఒక సరస్సు సహా 27 కీలక ప్రాంతాలతో కూడిన సవివరమైన ప్రామాణిక మ్యాప్‌ను సర్వే ఆఫ్ ఇండియా విడుదల చేసింది. ఇరు దేశాల మధ్య సరిహద్దుకు సంబంధించి పూర్తి క్లారిటీతో ఈ మ్యాప్‌ను విడుదల చేసింది. అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపుల తరువాత ఈ మ్యాప్‌ను ఖరారు చేసినట్టు హోంశాఖ తెలిపింది. తాజా మ్యాప్‌తో ప్రజలకు మరింత అవగాహన పెరుగుతుందని సర్వే ఆఫ్ ఇండియా చెప్పింది. మ్యాప్‌లో తాజాగా చేర్చిన 27 ప్రాంతాల్లో సరిహద్దున ఉన్న మూడు ప్రాంతాలకు (సుబన్‌సిరి జిల్లా) వ్యూహాత్మక ప్రాధాన్యం ఉంది. అదే జిల్లాలోని నాలుగు మౌంటెయిన్ పాస్‌లను కూడా మ్యాప్‌లో చూపించారు. ఈ ప్రాంతాలన్నీ మిలిటరీ మ్యాపుల్లో ఇప్పటికే అందుబాటులో ఉన్నప్పటికీ సర్వే ఆఫ్ ఇండియా మ్యాపులో వీటిని స్పష్టంగా చూపించడమంటే చైనాకు గట్టి కౌంటర్ ఇచ్చినట్టేనని సంబంధిత వర్గాలు తెలిపాయి. మ్యాపులో చూపించిన పలు ప్రాంతాల్లో చైనా, భారత్ దళాల మధ్య ఘర్షణలు జరిగాయి. అరుణాచల్ ప్రదేశ్‌ను దక్షిణ టిబెట్ అని పిలిచే చైనా ఆ రాష్ట్రంలోని 23 ప్రాంతాలకు కొత్త పేర్లను ఖరారు చేస్తూ ఒక ప్రకటన విడుదల చేసిన విషయం తెలిసిందే. అయితే, ఈ చర్యలతో క్షేత్రస్థాయిలో ఎలాంటి మార్పులు ఉండవని చైనాకు భారత్ అప్పట్లోనే గట్టి కౌంటర్ ఇచ్చింది. అరుణాచల్ ప్రదేశ్ ఎప్పటికీ భారత్‌లో భాగంగానే ఉంటుందని స్పష్టం చేసింది. చైనా, భారత్‌ల మధ్య సరిహద్దు రేఖ మెక్‌మెహన్ లైన్ టిబెట్, అరుణాచల్ ప్రదేశ్‌ను వేరు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో అరుణాచల్ ప్రదేశ్‌లో 27 ప్రదేశాలకు భారత్ కొత్త పేర్లను పెట్టింది. కొన్ని ప్రదేశాలకు చైనా పేర్లు పెడుతున్న నేపథ్యంలో.. దానికి కౌంటర్‌గా ఇండియా కూడా కొత్త పేర్లను ఖరారు చేసింది. భారతీయ మ్యాప్‌లో సుమారు 27 ప్రదేశాలను గుర్తించి .. వాటికి ఇండియా కొత్త పేర్లను పెట్టింది. అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన సర్వే ఆఫ్ ఇండియా మ్యాప్‌లో ఆ ప్రదేశాలను గుర్తించారు. స్థానికులు గుర్తుపట్టే రీతిలో ఆ పేర్లను పెట్టినట్లు ప్రకటనలో తెలిపారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని కొన్ని ప్రదేశాలకు చైనా పేర్లు పెట్టడాన్ని భారత్ వ్యతిరేకించిన విషయం తెలిసిందే. వాస్తవాధీన రేఖ వెంట ఉన్న లాంగ్ జూ ప్రాంతం కూడా కొత్తగా పేరు పెట్టిన ప్రదేశంలో ఉన్నది. ఇక్కడే 1959లో ఇండియా, చైనా మధ్య ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఈ ప్రాంతంలోకి చైనా దళాలు ఎంటర్ అయ్యాయి. లాంగ్ జూ సమీపంలో ఉన్న మాజా అనే గ్రామాన్ని కూడా కొత్త మ్యాప్‌లో మార్క్ చేశారు. ఇది అప్పర్ సుబన్‌సిరి జిల్లాలో ఉన్నది. పర్వత ప్రాంతాలైన జో లా, రిజా లా, పుకుర్ లాతో పాటు బిసా గ్రామం కూడా కొత్త లిస్టులో ఉన్నది. హై ఆల్టిట్యూడ్ పాసేజ్‌లో థాగ్ లా ఉన్నది. 1962లో ఇదే ప్రాంతంలో భారత్, చైనా మధ్య ఘర్షణ జరిగింది. ప్రస్తుతం ఈ ప్రాంతాన్ని కూడా అధికారికంగా మ్యాప్‌లో గుర్తించారు. చాంగ్‌లాంగ్ జిల్లాలో ఉన్న జైరాంపూర్‌ను కూడా లిస్టులో పెట్టారు. సాంబో సరోవర్, బారా కుందన్, చోటా కుందన్, దాన్ బారి, ప్రిత్‌నగర్, తెరిత్నగర్, రామ్‌నగర్, జశ్వంత్ ఘర్, సాగర్, పద్మ, జ్యోతినగర్, బైసాకి ప్రాంతాలు కొత్త లిస్టులో ఉన్నాయి. షేర్ ఏ తప్పా స్మారకం, చోటా రూపక్, బారా రూపక్, శివాజీ నగర్, సున్పురా, కమలాంగ్ నగర్, కమలాంగ్ సాంక్చురీ, బుద్ధామందిర్ కూడా జాబితాలో ఉన్నాయి.

# తెలంగాణలో జనసేన ఒంటరి పోరు? పొత్తులపై శంకర్‌గౌడ్ కీలక వ్యాఖ్యలు

### పొత్తులపై తుది నిర్ణయం పవన్ కల్యాణ్, బీజేపీ జాతీయ నాయకత్వానిదే: శంకర్‌గౌడ్

### పొత్తు కుదరకపోతే జనసేన సొంతంగా బరిలోకి దిగుతుందని స్పష్టీకరణ

### తెలంగాణలో జనసేనకు ఆదరణ పెరుగుతోందన్న శంకర్‌గౌడ్



హైదరాబాద్, ఆగస్టు 08 (నేటి ప్రస్థానం): తెలంగాణలో రానున్న ఎన్నికల్లో జనసేన, బీజేపీ మధ్య పొత్తు ఉంటుందా? లేదా? అనే చర్చ కొనసాగుతున్న వేళ జనసేన రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. పొత్తులపై తుది నిర్ణయం జనసేన అధినేత పవన్ కల్యాణ్, బీజేపీ జాతీయ నాయకత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఈ అంశం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు పరిధిలో లేదని పేర్కొన్నారు. బీజేపీతో పొత్తు కుదరకపోతే తెలంగాణలో జనసేన సొంతంగా ఎన్నికల్లో పోటీ చేస్తుందని శంకర్‌గౌడ్ తెలిపారు. రాష్ట్రంలో పార్టీకి ఆదరణ క్రమంగా పెరుగుతోందని, పవన్ కల్యాణ్ పనితీరుపై ప్రజల్లో విశ్వాసం ఏర్పడటంతో ముఖ్యంగా యువత పెద్ద సంఖ్యలో జనసేనలో చేరుతున్నారని చెప్పారు. మరోవైపు జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఏ పార్టీతోనూ పొత్తు ఉండదని, బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని ఆ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్‌రావు ప్రకటించారు. దీంతో తెలంగాణలో బీజేపీ-జనసేన పొత్తుపై మరింత ఆసక్తి నెలకొంది.

# తెలంగాణ జ్యోతిష్య విజ్ఞాన సభలో కీలక తీర్మానం

## పండుగల తేదీలపై ఏకాభిప్రాయం..

### రెండు సంవత్సరాల పండుగల నిర్ణయాలకు శాస్త్రీయ ప్రాతిపదిక





**హైదరాబాద్, ఆగస్టు 8:** హిందూ పండుగల తేదీల విషయంలో గత కొంతకాలంగా నెలకొంటున్న గందరగోళానికి తెరదించే దిశగా తెలంగాణ జ్యోతిష్య విజ్ఞాన సభ కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ అర్చక సమాఖ్య, భాగ్యనగర అర్చక పురోహిత సంఘం, భారతీయ తెలుగు దృగ్గణిత పంచాంగ కర్తల సమాఖ్య సేవా సంఘం, శ్రీ చండీ పరమేశ్వరి పీఠం సంయుక్త ఆధ్వర్యంలో ఆగస్టు 6న హైదరాబాద్ బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో ఈ సభ ఘనంగా నిర్వహించారు. డాక్టర్ అవసరాల ప్రసాద్ శర్మ సిద్ధాంతి అధ్యక్షతన, శ్రీ గట్టు శ్రీనివాసాచార్యుల సమన్వయంతో జరిగిన ఈ సభకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలువురు దృక్ సిద్ధాంత పంచాంగ కర్తలు, జ్యోతిష్య పండితులు, అర్చకులు, పురోహితులు హాజరయ్యారు. సభలో లిప్లవంగ నామ సంవత్సరం (2027-28), కీలక నామ సంవత్సరం (2028-29)లికు సంబంధించిన హిందూ పండుగలు, పర్వదినాల నిర్ణయాలను శాస్త్రబద్ధంగా పరిశీలించి, చర్చించిన అనంతరం ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా పలువు రు పండితులు మాట్లాడుతూ.. గత కొన్ని సంవత్స రాలుగా ఒకే హిందూ పండుగకు సంబంధించి రెండు వేర్వేరు తేదీలు, నిర్ణయాలు వెలువడటం వల్ల ప్రజల్లో గందరగోళం ఏర్పడుతోందని పేర్కొన్నారు. ఒకే పండుగను రెండు వేర్వేరు రోజుల్లో నిర్వహించే పరిస్థితి రావడంతో భక్తులు, ఆలయాలు, అర్చకులు, ప్రభుత్వ శాఖలు, విద్యాసంస్థలు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటు న్నాయని వివరించారు. ముఖ్యంగా పండుగల తేదీలపై స్పష్టత లేకపోవడం వల్ల ప్రభుత్వ సెలవులు, ఆలయ కార్యక్రమాలు, విద్యాసంస్థల కార్యకలాపాల నిర్వహణలోనూ సమస్యలు తలెత్తుతున్నాయని సభ దృష్టికి తీసుకొచ్చారు.భారత ప్రభుత్వం 1953లో ఏర్పాటు చేసిన క్యాలెండర్ రిఫార్మ్ కమిటీ సిఫార్సుల మేరకు ప్రత్యక్ష గ్రహగతుల ఆధారంగా రూపొందించే రాష్ట్రీయ పంచాంగం (చీఫ్అశీఅుశ్రీ ్రఖఅఎష్ట్రుఅస్త్ర) ప్రతి సంవత్సరం ప్రచురితమవుతోందని సభలో వివరించారు. ఈ రాష్ట్రీయ పంచాంగం ప్రాంతీయ భాషల్లోనూ అందుబాటులో ఉండటంతో పాటు రాష్ట్రాల దేవాదాయ, ధర్మాదాయ శాఖలకు అధికారి కంగా పంపిణీ అవుతున్న విషయాన్ని ప్రస్తావిం చారు.దృక్ సిద్ధాంత పంచాంగాల తయారీలో ప్రత్యక్ష గ్రహగతులు, శాస్త్రీయ గణనలను ప్రాతిపదికగా తీసుకుంటున్నామని పంచాంగ కర్తలు తెలిపారు. తాము రూపొందిస్తున్న దృక్ సిద్ధాంత పంచాంగాల్లో పేర్కొంటున్న పండుగల నిర్ణయాలు భారత ప్రభుత్వ రాష్ట్రీయ పంచాంగంలోని నిర్ణయాలతోనూ ఏకీభవిస్తున్నాయని వెల్లడించారు. సభలో పండుగల తేదీల నిర్ణయానికి సంబంధించిన అంశాలపై కూలంకషంగా చర్చించారు. వివిధ ప్రాంతాల్లో పంచాంగాల ఆధారంగా పండుగల నిర్వహణలో ఏర్పడుతున్న భిన్నాభిప్రాయాలు, వాటి వల్ల ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులు, భవిష్యత్తులో ఏకరీతి నిర్ణయాలను అమలు చేయాల్సిన అవసరంపై చర్చ జరిగింది. అనంతరం 2027-28, 2028-29 సంవత్సరాలకు సంబంధించిన పండుగల నిర్ణయాలతో పాటు సభలో చర్చించిన అంశాలన్నింటినీ తీర్మానంగా రూపొందించారు. ఈ తీర్మానాన్ని సభలోనే తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ వైస్ చైర్మన్ శ్రీ పొన్నాడ సుబ్రహ్మణ్యం గారికి, మాజీ మంత్రి శ్రీ వేణుగోపాలచారి గారికి అందజేశారు. పండుగల తేదీల విషయంలో భవిష్యత్తులో ప్రజలకు స్పష్టత కల్పించేందుకు, ఆలయాలు, అర్చకులు, ప్రభుత్వ విభాగాలు ఒకే విధమైన శాస్త్రబద్ధ నిర్ణయాన్ని అనుసరించేలా చర్యలు తీసుకోవాలని సభ ఆకాంక్షించింది. ఈ కార్యక్రమంలో శ్రీ వేణుగోపాలచారి, గౌరవ శ్రీ పొన్నాడ సుబ్రహ్మణ్యం, తెలంగాణ దేవాదాయ ధర్మాదాయ శాఖ మాజీ ఉద్యోగి, చైర్మన్ శ్రీ గంగు ఉపేంద్రశర్మ, పరాశర రవీంద్రాచార్యులు, శ్రీ డీవీఆర్ శర్మ, పెన్నా మోహన్ శర్మ, సతీష్ శర్మ, సంతోష్ శాస్త్రి, శ్రీకాంత్ తదితరులు పాల్గొని సభను గౌరవించారు. అలాగే శ్రీ గొర్తి పట్టాభి సిద్ధాంతి, పీఎస్ఆర్ కృష్ణ, నిట్టల కృష్ణ ప్రసాద్, సీవీ అనంత, కర్ర వీరభద్రం, బిజుమల్ల శ్రీనివాస్ సిద్ధాంతి తదితర తెలుగు రాష్ట్రాల సిద్ధాంతులు, పంచాంగ కర్తలు పాల్గొన్నారు. రెండు రాష్ట్రాలకు చెందిన జ్యోతిష్య, పంచాంగ నిపుణులు ఒకే వేదికపై సమావేశమై పండుగల నిర్ణయాలపై ఏకాభిప్రాయానికి రావడం సభకు ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది.

## సొంత నిధులతో సేవా బాట..

# ప్రజా అవసరాలకు పెద్దపీట





### నల్లూరి హైట్స్‌లో 200 మీటర్ల సీసీ రోడ్డు ప్రారంభం

### శశిధర్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో మొక్కలు నాటిన కాటా శ్రీనివాస్‌గౌడ్

### ప్రజా సేవలో శశిధర్‌రెడ్డి చొరవ అభినందనీయం: కాటా శ్రీనివాస్‌గౌడ్

**గుమ్మడిదల (అమీన్‌పూర్), ఆగస్టు 08 (నేటి ప్రస్థానం):** ప్రజా అవసరాలను గుర్తించి సొంత నిధులతో మౌలిక వసతులు కల్పిస్తూ, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తున్న అమీన్‌పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి సేవలను పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ అభినందించారు. బీరంగూడ డివిజన్ పరిధిలోని నల్లూరి హైట్స్‌లో శశిధర్‌రెడ్డి, ఆయన సతీమణి, మాజీ కౌన్సిలర్ లావణ్య శశిధర్‌రెడ్డి సొంత నిధులతో నిర్మించిన 200 మీటర్ల సీసీ రోడ్డును కాటా శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. అనంతరం కాలనీలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కాటా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి శశిధర్‌రెడ్డి ముందుండి పనిచేస్తున్నారని, సొంత నిధులతో అభివృద్ధి పనులు చేపట్టడం అభినందనీయమన్నారు. రహదారి నిర్మాణంతో పాటు పచ్చదనం పెంపునకు చర్యలు తీసుకోవడం మంచి ఆలోచన అని పేర్కొన్నారు. శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ నిధులతో పరిష్కరించాల్సిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, అత్యవసరమైన పనులను సొంత నిధులతో చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే తన లక్ష్యమన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. రోడ్డు నిర్మాణం, మొక్కలు నాటడం పట్ల నల్లూరి హైట్స్ కాలనీవాసులు హర్షం వ్యక్తం చేసి శశిధర్‌రెడ్డి, లావణ్య దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కాటా శ్రీనివాస్‌గౌడ్, శశిధర్‌రెడ్డి, లావణ్య శశిధర్‌రెడ్డి దంపతులను కాలనీవాసులు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధా శ్రీనివాస్‌గౌడ్, ఆత్మ కమిటీ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సీనియర్ నాయకులు, నల్లూరి హైట్స్ కాలనీవాసులు, వివిధ కాలనీల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.







## బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలు

### కేక్ కట్ చేసి, ఆసుపత్రిలో పండ్ల పంపిణీ



**ఆలేరు ఆగస్టు :** స్థానిక బీఆర్ఎస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు పుట్ట మల్లేశ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులుకల్లూరిరామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బీఆర్ఎస్ కార్యాలయంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరిపారు. అనంతరం స్థానిక ఆసుపత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పుట్ట మల్లేష్ మాట్లాడుతూ కల్లూరి రామచంద్రారెడ్డి పార్టీ కోసం చేస్తున్న సేవలను కొనియాడారు. ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సెక్రటరీ జనరల్ కుండే సంపత్, కౌన్సిలర్ యాట శివ, బీజాని మధు కుమార్, పాకాల హరీష్, కొలుపుల హరినాథ్, ఆడెపు బాలస్వామి, భేతి రాములు, పంతం కృష్ణ, పాషికంటి శ్రీనివాస్, యాట విజయ, జూకంటి చిన్న ఉప్పలయ్య, కూతాటి అంజన్ కుమార్, రాయపురం నరసింహులు, జింకల రామకృష్ణ యాదవ్, జూకంటి పెద్ద ఉప్పలయ్య, ఎలగల హరికృష్ణ, ఎలుగల శివ, సీస సత్తయ్య, గట్టు రాజు, మెరుగు కృష్ణమూర్తి, ఎండి ఫయాజ్ టింకు, కాసుల శశి ప్రీతం, దొంతుల ఎల్లేష్, మండల రామ్మూర్తి, జానీ, అంబాల శ్రీనివాస్, మొరిగాడి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తునహాజరైకల్లూరిరామచంద్రారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## బోనాల పండుగకు జిల్లా గణేష్ ను ఆహ్వానించిన ఆలయ కమిటీ సభ్యులు



**కూకట్ పల్లి, ఆగస్టు 08 :** శేరిలింగంపల్లి నియోజకవర్గ ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని పలు అమ్మవారి దేవాలయ కమిటీ సభ్యులు కాంగ్రెస్ సీనియర్ నాయకులు జిల్లా గణేష్ నేత ఆహ్వాన పత్రిక అందజేసి బోనాల పండుగ సందర్బంగ అమ్మవారి పూజ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి ఆశీర్వాదం తీలుకోవాల్సిందినగా కోరారు. ఈ సందర్భంగా జిల్లా గణేష్ మాట్లాడుతూ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయలకు ప్రతీక బోనాల పండుగ, ఆషాడ మాస చివరి ఆదివారం హైదరాబాద్ చుట్టుపక్కల అన్ని ప్రాంతాల్లో ఘనంగా నిర్వహిస్తారని ఈ పూజ కార్యక్రమంలో నన్ను ఆహ్వానించడం ఆనందంగా ఉందని అన్నారు . ఈ కార్యక్రమంలో పలు కాలనీల ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీశ్రీశ్రీ విజయ దుర్గ భవాని అమ్మవారి విగ్రహ ప్రతిష్ట వార్షికోత్సవం...

### పాల్గొన్న మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్...



శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి డివిజన్ ప్రశాంతి నగర్ లోని శ్రీశ్రీశ్రీ విజయ దుర్గ భవాని అమ్మవారి విగ్రహ ప్రతిష్ట వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా వడ్డించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నాను. ఇలాంటి ధార్మిక కార్యక్రమాలు సమాజంలో సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తాయి. ఆలయ అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రెసిడెంట్ అశోక్, అశోక్, మురుగేష్, శ్రీనివాస్, సత్తి కుమార్, గోపాల్, ప్రణేష్, బాపునగర్ హనుమాన్ యూత్ ప్రెసిడెంట్ రాజకుమార్, సుధాకర్ రెడ్డి, కృష్ణ స్థానికవాసులు తదితరులు పాల్గొన్నారు.సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక



## ఘనంగా శ్రీశ్రీశ్రీ విజయ దుర్గ భవాని అమ్మవారి విగ్రహ ప్రతిష్ట వార్షికోత్సవం...

**పాల్గొన్న మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్...**

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ ప్రశాంతి నగర్ లోని శ్రీశ్రీశ్రీ విజయ దుర్గ భవాని అమ్మవారి విగ్రహ ప్రతిష్ట వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా వడ్డించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నాను. ఇలాంటి ధార్మిక కార్యక్రమాలు సమాజంలో సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తాయి. ఆలయ అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రెసిడెంట్ అశోక్, అశోక్, మురుగేష్, శ్రీనివాస్, సత్తి కుమార్, గోపాల్, ప్రణేష్, బాపునగర్ హనుమాన్ యూత్ ప్రెసిడెంట్ రాజకుమార్, సుధాకర్ రెడ్డి, కృష్ణ స్థానికవాసులు తదితరులు పాల్గొన్నారు.సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సంగారెడ్డిలో ఘనంగా బోనాల ఊరేగింపు

**ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్**



**సంగారెడ్డి,ఆగస్టు 8 :** సంగారెడ్డి జిల్లా కేంద్రంలో మాదిగ సంఘం ఆధ్వర్యంలో బోనాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు.పట్టణంలోని ఐబీ నుంచి ప్రారంభమైన ఊరేగింపులో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాదిగ సంఘం నాయకులను ఆప్యాయంగా పలకరించి, వారితో కలిసి ఉత్సాహంగా గడిపారు. బోనాల ఊరేగింపులో దేవతామూర్తుల వేషధారణలు, డప్పు చప్పుళ్ళు, మహిళల నృత్యాలు, పోతురాజుల విన్యాసాలు, డీజే, ప్రత్యేక బ్యాండ్ ఆకట్టుకున్నాయి.అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ కోరుకున్నారు. అనంతరం అస్తబాల్ ఎల్లమ్మ తల్లికి బోనాలను సమర్పించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సి డి సి చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, చింత సాయినాథ్, కౌన్సిలర్ నాని, చక్రపాణి, మధుసూదన్ రెడ్డి, కసిని శ్రీకాంత్, కసిని చందుతో పాటు మహిళలు, యువకులు, మాదిగ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## గురుకులాల్లో విద్యార్థుల తల్లిదండ్రులను గౌరవించాలి

**అవమానించేలా మాట్లాడకుండా**
**సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలి**

**ఎస్టీ ట్రైబల్ హాస్టల్స్ పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు డా. బుర్రి వెంకన్న**

**నల్గొండ జిల్లా, ఆగస్టు 08 :** గురుకుల పాఠశాలలు, వసతి గృహాల్లో చదువుతున్న బాలికలు, బాలుర తల్లిదండ్రుల పట్ల ఉపాధ్యా యులు, ఉపాధ్యాయినులు, వార్డెన్లు, హౌస్ ఉపాధ్యా యులు,ప్రిన్సిపాళ్లు గౌరవంగా వ్యవహరించాలని కొండమల్లేపల్లి మండలం చెన్నారం ఎస్టీ ట్రైబల్ హాస్టల్స్ పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు డా. బుర్రి వెంకన్న కోరుతూ వెల్లడించారు. విద్యార్థులకు ఏదైనా సమస్య వచ్చినప్పుడు లేదా అత్యవసర పరిస్థితుల్లో తల్లిదండ్రులు హాస్టల్‌కు వచ్చినప్పుడు వారి సమస్యలను సానుకూలంగా విని, మానవతా దృక్పథంతో స్పందించాలని ఆయన సూచించారు. తల్లిదండ్రులను అవమానించే విధంగా లేదా కించపరిచేలా మాట్లాడటం సరికాదన్నారు. ఇటీవల ఏలూరు జిల్లాలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ బాలికల గురుకుల హాస్టల్‌లో ఓ విద్యార్థిని పుట్టినరోజు సందర్భంగా ఆమె తల్లిదండ్రులు హాస్టల్‌కు వెళ్లిన సందర్భంలో ఎదురైన పరిణామాలపై స్పందిస్తూ డా.బుర్రి వెంకన్న ఈ వ్యాఖ్యలు చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులను గౌరవంగా ఆహ్వానించి, వారితో మర్యాదగా మాట్లాడాల్సిన బాధ్యత హాస్టల్ సిబ్బందిపై ఉందన్నారు.గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులు తల్లిదండ్రులకు దూరంగా ఉండటం వల్ల వారిపై ఉపాధ్యాయులు, హాస్టల్ సిబ్బంది మరింత బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు.

### హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 196వ అన్నదాన కార్యక్రమం....

**హోప్ ఫౌండేషన్ పేటిందే సేవ చేయడానికి కొండ విజయ్ కుమార్....**

చందానగర్: అన్నదాన కార్యక్రమం శనివారం గంగారంలోని హోప్ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో హోప్ సభ్యులతో పాటు చైర్మన్ కొండ విజయ్కుమార్ పాల్గొని ప్రజలకు అన్న ప్రసాదాలు వడ్డించారు. ఈ వారం అన్నదాన కార్యక్రమానికి సుమారు 3200 మంది పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా హోప్ చైర్మన్ విజయ్ కుమార్ మాట్లాడుతూ...తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిరంతరాయంగా నిర్వహిస్తున్నామన్నారు. ఆకలితో ఉన్నవారికి కడుపునిండా అన్నం పెట్టి వారి ఆకలి తీర్చడలో తనకు ఎంతో సంతృప్తినిస్తుంది అన్నారు.

# నకిలీ నంబర్ ప్లేట్లతో తిరుగుతున్నారా..?

**పట్టుబడితే వాహనం సీజ్, క్రిమినల్ కేసు!**

**ఫేక్, ట్యాంపరింగ్ నంబర్ ప్లేట్లపై హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక తనిఖీలు**

**నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలపై 5 క్రిమినల్ కేసులు.. వాహనాలు సీజ్**

**HSRP నంబర్ ప్లేట్లు తప్పనిసరి.. 'జీరో టాలరెన్స్' విధానంతో కఠిన చర్యలు**





**హైదరాబాద్, ఆగస్టు 08 (నేటి ప్రస్థానం):** ట్రాఫిక్ చలానాల నుంచి తప్పించుకునేందుకు వాహనాల నంబర్ ప్లేట్లను మార్చడం, ట్యాంపరింగ్ చేయడం ఇకపై కుదరదు. నకిలీ, ట్యాంపరింగ్ నంబర్ ప్లేట్ల వినియోగంపై హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. నగరంలో చేపట్టిన తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా నంబర్ ప్లేట్లు ఉపయోగిస్తున్న వాహనాలను గుర్తించి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలపై మొత్తం ఐదు క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు హైదరాబాద్ సిటీ పోలీస్ ట్రాఫిక్ విభాగం జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్ తెలిపారు. పంజాగుట్ట, చిలకలగూడ, దిండి, కంచన్‌బాగ్, చాంద్రాయణగుట్ట/బాండ్లగూడ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ కేసులు నమోదైనట్లు వెల్లడించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాహనదారులు ప్రభుత్వం ఆమోదించిన హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లు (HSRP) మాత్రమే వినియోగించాలని జోయల్ డేవిస్ సూచించారు. నంబర్ ప్లేట్లను మార్చడం, అంకెలను ట్యాంపరింగ్ చేయడం లేదా నకిలీ నంబర్ ప్లేట్లను ఉపయోగించడం వంటి చర్యలను ఏమాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఫేక్, ట్యాంపరింగ్ నంబర్ ప్లేట్లపై 'జీరో టాలరెన్స్' విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ఇకపై ఇలాంటి నంబర్ ప్లేట్లతో పట్టుబడే వాహనాలను సీజ్ చేయడంతో పాటు సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ, వాహనాలకు చట్టబద్ధమైన HSRP నంబర్ ప్లేట్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

## గుమ్మడిదలలో అంగరంగ వైభవంగా బోనాలు

**ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే గూడెం మైపాల్ రెడ్డి**



గుమ్మడిదల మున్సిపల్: సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలో శనివారం నిర్వహించిన దుర్గమ్మ తల్లి బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు నిర్వాహకులు, భక్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలంతా భక్తిశ్రద్ధలతో బోనాల ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణలో బోనాల పండుగకు పోతురాజుల, ఏర్పుల పంబల్ల బైండ్ల, మాధుల, కమ్మరి కుమ్మరి సుబ్బండ కులాల మొత్తం దారులతో పోతరాజుల, శివసత్తుల విన్యాసాల తోప్రత్యేకమైన ప్రాధాన్యత ఉందని, తరతరాలుగా వస్తున్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పండుగలను ప్రజలంతా ఐక్యతతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు.గుమ్మడిదల ప్రాంతం మరింత అభివృద్ధి చెందేలా ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా తాము నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.అమ్మవారి ఆశీస్సులతో గుమ్మడిదల ప్రాంత ప్రజలందరికీ మంచి జరగాలని, నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ సంధ్య గోవర్ధన్ రెడ్డి, విజయ్ భాస్కర్ రెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు,నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సంగారెడ్డిలో ఘనంగా బోనాల ఊరేగింపు





**ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్**

**సంగారెడ్డి,ఆగస్టు 8:** సంగారెడ్డి జిల్లా కేంద్రంలో మాదిగ సంఘం ఆధ్వర్యంలో బోనాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు.పట్టణంలోని ఐబీ నుంచి ప్రారంభమైన ఊరేగింపులో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాదిగ సంఘం నాయకులను ఆప్యాయంగా పలకరించి, వారితో కలిసి ఉత్సాహంగా గడిపారు. బోనాల ఊరేగింపులో దేవతామూర్తుల వేషధారణలు, డప్పు చప్పుళ్లు, మహిళల నృత్యాలు, పోతురాజుల విన్యాసాలు, డీజే, ప్రత్యేక బ్యాండ్ ఆకట్టుకున్నాయి. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ కోరుకున్నారు. అనంతరం అస్తబాల్ ఎల్లమ్మ తల్లికి బోనాలను సమర్పించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సి డి సి చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, చింత సాయినాథ్, కౌన్సిలర్ నాని, చక్రపాణి, మధుసూదన్ రెడ్డి, కసిని శ్రీకాంత్, కసిని చందుతో పాటు మహిళలు, యువకులు, మాదిగ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# అమ్మకానికి ఎల్ఐసీ వాటా




న్యూఢిల్లీ, ఆగస్టు 3: ప్రభుత్వ రంగ జీవిత బీమా సంస్థ ఎల్ఐసీలో కేంద్ర ప్రభుత్వం 6.5 శాతం వరకు (82.22 కోట్ల షేర్లు) వాటాను అమ్మేస్తున్నది. మంగళ, బుధవారాల్లో ఈ మేరకు ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) జరుగుతుంది. ఒక్కో షేర్ ధర రూ.382గా ఉన్నది. మంగళవారం నాన్-రిటైల్ ఇన్వెస్టర్లకు, బుధవారం రిటైల్ ఇన్వెస్టర్లకు సబ్‌స్క్రిప్షన్ అందుబాటులో ఉంటుంది. పూర్తి స్థాయి లో షేర్లు అమ్ముడైపోతే ఖజానాకు దాదాపు రూ.31,000 కోట్లు అందుతుందని అంచనా. 'ఈ ఓఎఫ్ఎస్ ద్వారా 2.5 శాతం వాటాను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకుంటున్నది. అలాగే గ్రీన్ షూ ఆప్షన్ కింద అదనంగా మరో 4 శాతం అమ్మకానికి పెడుతున్నారు' అని పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ శాఖ (దీపమ్) కార్యదర్శి అరుణిష్ చావ్లా సోమవారం ఎక్స్‌లో తెలిపారు. బీఎస్ఈలో ఎల్ఐసీ షేర్ విలువ రూ.424.35 వద్ద ముగిసింది. దీనిపై 10 శాతం రాయితీ ధరకే ఓఎఫ్ఎస్‌లో ఎల్ఐసీ షేర్లను అమ్మకానికి పెడుతున్నట్టు చావ్లా వివరించారు. ఇదిలావుంటే క్యాపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం వచ్చే ఏడాది మే 16కల్లా ఎల్ఐసీలో పబ్లిక్ షేర్‌హోల్డింగ్ 10 శాతానికి చేరుకోవాల్సి ఉన్నది. ప్రస్తుతం కంపెనీలో కేంద్రం వాటా 96.5 శాతంగా ఉన్నది. 2022 మే నెలలో స్టాక్ మార్కెట్లలోకి పబ్లిక్ ఇష్యూ ద్వారా వచ్చినప్పుడు 3.5 శాతం వాటాను అమ్మేసిన విషయం తెలిసిందే. రూ.902-949 ధరల శ్రేణిలో వచ్చిన ఈ ఐపీవో ద్వారా రూ.21,000 కోట్లను కేంద్రం సమీకరించింది. ఎల్ఐసీ మార్కెట్ విలువ ప్రస్తుతం రూ.5.36 లక్షల కోట్లుగా ఉన్నది. కాగా, ఈ ఆర్థిక సంవత్సరం (2026-27)లో ఇప్పటిదాకా కేంద్ర ప్రభుత్వం రూ.21,082 కోట్ల నిధులను సమీకరించింది. సూతీ (స్పెసిఫైడ్ అండర్‌టేకింగ్ ఆఫ్ ది యూనిట్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా) నుంచి 7 ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాల విక్రయం ద్వారా, రెమిటెన్స్‌ల నుంచి ఈ నిధులను పొందింది.



# 1.48 లక్షల దిగువకు పుత్తడి

**రూ.900 తగ్గిన తులం ధర**

న్యూఢిల్లీ, ఆగస్టు 3: బంగారం ధరలు క్రమంగా దిగొస్తున్నాయి. రూపాయి బలోపేతం కావడం, అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాలకు డిమాండ్ పడిపోవడంతో దేశీయంగా ధరలు భారీగా తగ్గాయి. న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల గోల్డ్ ధర రూ.900 తగ్గి రూ.1.48 లక్షల దిగువకు రూ.1,47,400కి పడిపోయింది. ఈ విషయాన్ని ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వెల్లడించింది. అంతకుముందు ఇది రూ.1,48, 300గా ఉన్నది. పసిడితోపాటు వెండి ధరలు భారీగా తగ్గాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు అంతంత మాత్రంగానే ఉండటంతో కిలో వెండి రూ.1,800 దిగి రూ.2,26, 500గా నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్లో గోల్డ్, వెండిలకు డిమాండ్ పడిపోవడంతోపాటు డాలర్‌తో పోలిస్తే రూపాయి బలోపేతం కావడం ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను ఈక్విటీల వైపు మళ్లించడంతో వీటి ధరలు తగ్గాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 4,048.89 డాలర్లు పలుకగా, వెండి 57.97 డాలర్ల వద్ద ఉన్నది.

# తయారీ రంగం కుదేలు




న్యూఢిల్లీ, ఆగస్టు 3: దేశీయ తయారీ రంగ కార్యకలాపాల్లో వృద్ధి ఈ ఏడాది జూలై నెలలో ఐదేండ్ల కనిష్ఠానికి పడిపోయింది. సవాళ్లతో కూడిన మార్కెట్ పరిస్థితుల నడుమ మందగించిన కొత్త వ్యాపార ఆర్డర్లే ఇందుకు కారణమని తేలింది. ఈ క్రమంలోనే సోమవారం విడుదలైన సర్వేలో హెచ్ఎస్‌బీసీ ఇండియా మ్యానుఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) 53.5కు తగ్గింది. అంతకుముందు నెల జూన్‌లో ఇది 54.2గా ఉన్నది. దీంతో 2021 ఆగస్టు నుంచి గమనిస్తే.. ఇదే కనిష్ఠంగా తేలింది. కాగా, కొత్త ఆర్డర్లతోపాటు ఉత్పత్తి, ఉపాధి, సప్లయర్ డెలివరీ వేళలు, స్టాక్స్ కొనుగోలు అంశాల ఆధారంగా పీఎంఐ గణాంకాల గణన ఉంటుంది. జూలైలో కొత్త ఆర్డర్లలో వృద్ధిరేటు గడిచిన నాలుగేండ్లకుపైగా కాలంలో రెండో అత్యంత కనిష్ఠ స్థాయికి క్షీణించినట్టు చెప్తున్నారు. అలాగే ఉపాధి సృష్టి సైతం దేశీయ ఉత్పాదక రంగ పరిశ్రమలో వరుసగా మూడో నెల దిగజారిందని సర్వేలో ఎక్స్‌పర్ట్స్ అంటున్నారు. మే, జూన్, జూలై నెలల్లో కొత్త ఉద్యోగాలు అంతగా ఆశాజనకంగా లేవని వివరిస్తున్నారు.

# ఐఐఆర్ఎం రూ.150 కోట్ల ఫండింగ్!

బీమా పంపిణీ సంస్థ ఐఐఆర్ఎం హోల్డింగ్స్ ఇండియా రూ. 150 కోట్ల నిధులను సమకూర్చుకుంటున్నట్లు తెలిపింది. కార్పెడియం క్యాపిటల్, సాన్ని ఫండ్-1 లీడ్ ఇన్వెస్టర్లుగా వ్యవహరిస్తున్నట్లుగా పేర్కొంది. ఒక్కో షేరుకు రూ. 143.28 ధర చొప్పున ఫుల్లీ కన్వర్టబుల్ వారంట్లు, షేర్ల జారీ ద్వారా నిధులను సమీకరిస్తున్నట్లు కంపెనీ చైర్మన్ వి. రామకృష్ణ చెప్పారు. ఈ మొత్తాన్ని వ్యాపార విస్తరణ, కొనుగోళ్లు, వర్కింగ్ క్యాపిటల్ మొదలైన అవసరాల కోసం వినియోగించుకోనున్నట్లు వివరించారు. సింగపూర్, శ్రీలంక తదితర దేశాల్లో కూడా కార్యకలాపాలు సాగిస్తున్న ఐఐఆర్ఎం హోల్డింగ్స్‌కి 18 కార్యాలయాలు ఉన్నాయి. 2,000 పైచిలుకు కార్పొరేట్ క్లయింట్లు, 500 మంది సిబ్బంది ఉన్నారు.



# పెట్రోల్ ఎగుమతులపై ట్యాక్స్ పెంపు!




న్యూఢిల్లీ: పెట్రోల్, డీజిల్, ఏటీఎఫ్‌ల ఎగుమతులపై కేంద్రం విండ్‌ఫాల్ గెయిన్స్ ట్యాక్స్‌ను పెంచింది. ఆగస్టు 3 (సోమవారం) నుంచి పక్షం రోజుల పాటు ఇది అమలవుతుంది. ఆర్థిక శాఖ నోటిఫికేషన్ ప్రకారం డీజిల్ ఎగుమతులపై ప్రత్యేక అదనపు ఎక్సైజ్ డ్యూటీ (ఎస్ఏఈడీ)ని లీటరుకు రూ. 15.5 నుంచి రూ. 25.5కి పెంచారు. అలాగే ఏటీఎఫ్‌పై లీటరుకు రూ. 14.5 నుంచి రూ. 22కి, పెట్రోల్‌పై రూ. 2,5 నుంచి రూ. 3.5కి ఎస్ఏఈడీ పెరిగింది. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో.. దేశీయంగా ఇంధనాల లభ్యతను పెంచేందుకు మార్చి 27న డీజిల్, ఏటీఎఫ్‌పై ఆ తర్వాత మే 16 నుంచి పెట్రోల్ ఎగుమతులపైనా విండ్‌ఫాల్ ట్యాక్స్ విధిస్తున్నారు. అంతర్జాతీయ, దేశీయ రేట్ల మధ్య వ్యత్యాసాన్ని ఎగుమతిదారులు అనుచితంగా సొమ్ము చేసుకోకుండా నివారించేందుకు కేంద్రం ఈ ట్యాక్స్‌ను విధిస్తుంది.




# లాభాలకు బ్రేక్.. నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు!

మంగళవారం ఉదయం మిశ్రమ ఫలితాలతో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమయానికి నష్టాలను చవిచూశాయి. సెన్సెక్స్ 210.08 పాయింట్లు లేదా 0.27 నష్టంతో 78,428.95 వద్ద, నిఫ్టీ 159.40 పాయింట్లు లేదా 0.64 శాతం నష్టంతో 24,614.90 వద్ద నిలిచాయి. ఏథర్ ఎనర్జీ లిమిటెడ్, కేఈఐ ఇండస్ట్రీస్ లిమిటెడ్, గ్రాఫైట్ ఇండియా లిమిటెడ్ వంటి కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో చేరాయి. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, యూపీఎల్ లిమిటెడ్, సీఈ ఇన్ఫో సిస్టమ్స్ లిమిటెడ్ వంటి సంస్థలు నష్టాలను చవిచూశాయి.

# ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఆకర్షణీయం!

న్యూఢిల్లీ, ఆగస్టు 3: కరోనా మహమ్మారి నేపథ్యంలో తగ్గిన బ్యాంక్ రుణాల వడ్డీరేట్లకు అనుగుణంగా ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డీ)పైనా వడ్డీరేట్లు పడిపోయాయి. అప్పట్నుంచి సంప్రదాయ మదుపర్లు సేఫ్ జోన్‌లో అధిక వడ్డీ ఆదాయం కోసం అన్వేషిస్తూనే ఉన్నారు. అయితే ప్రస్తుతం అధిక ద్రవ్యోల్బణం కారణంగా వడ్డీరేట్లు పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. దేశీయ రిటైల్ ద్రవ్యోల్బణం గణాంకాలు గత నెల జూలైకిగాను ఇంకా విడుదల కాలేదు. కానీ అంతకుముందు నెల జూన్‌లో 4.38 శాతంగా నమోదయ్యాయి. ద్రవ్యోల్బణం కట్టడికి ఆర్బీఐ పెట్టుకున్న 4 శాతం పరిమితిని ఇది మించిపోయింది. ఈ వారం ఆర్బీఐ ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్ష జరుగనున్నది. అయితే ఇందులో కీలక వడ్డీరేట్లను యథాతథంగానే ఉంచవచ్చన్న అంచనాలు వినిపిస్తున్నాయి. ఇదే జరిగితే వడ్డీరేట్లు ఎక్కడివక్కడే ఉంటాయి. కానీ పశ్చిమాసియా సంక్షోభం, ఎల్ నినోతో వర్షాభావ పరిస్థితుల కారణంగా ద్రవ్యోల్బణం విజృంభించే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. దీంతో రాబోయే ద్రవ్య సమీక్షల్లో వడ్డీరేట్ల పెంపు తప్పదన్న అభిప్రాయాలున్నాయి. ఫలితంగా బ్యాంకులూ వడ్డీరేట్లను పెంచేందుకే వీలున్నది. దీంతో ఎఫ్‌డీలపైనా వడ్డీరేట్లు పెరుగడం ఖాయమే అని చెప్పవచ్చు. తొలుత స్వల్పకాలిక డిపాజిట్లు, ఆ తర్వాత లాంగ్ టర్మ్ ఎఫ్‌డీ రేట్లు పెరుగుతాయని బ్యాంకింగ్ వర్గాలు చెప్తున్నాయి.



**అంతకంతకూ విజృంభణ**

వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం గణాంకాలు అంతకంతకూ పెరుగుతూపోతున్నాయి. నిరుడు అక్టోబర్‌లో 0.25 శాతంగా ఉంటే.. ఈ ఏడాది జూన్‌లో 4.38 శాతానికి పెరిగాయి. దీనికితోడు టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం గణాంకాలూ పెరుగుతున్నాయి. ఈ క్రమంలో అక్టోబర్ ద్రవ్యసమీక్షలో వడ్డీరేట్ల పెంపు తప్పదన్న అంచనాలు గట్టిగానే నెలకొన్నాయి. కాగా, రుణాల డిమాండ్, డిపాజిట్ల వృద్ధిలో మందగమనం, పదేండ్ల ప్రభుత్వ బాండ్లపై రాబడులు, చిన్న మొత్తాల ఆకర్షణీయ వడ్డీరేట్లు కూడా ఎఫ్‌డీలపై వడ్డీరేట్ల పెంపునకు దోహదం చేస్తాయని అంటున్నారు.

**ఇదీ సంగతి..**

మార్కెట్‌లో ప్రస్తుతం నెలకొన్న ఒడిదుడుకులు.. మదుపర్లను బెంబేలెత్తిస్తున్నాయి. స్టాక్ మార్కెట్లు, డెట్ మార్కెట్లు, బంగారం-వెండి, కరెన్సీ, కమోడిటీ మార్కెట్ సూచీలు తీవ్ర ఆటుపోట్లకు లోనవుతున్నాయి మరి. ఈ పరిస్థితులు సురక్షిత పెట్టుబడి సాధనాల కోసం ఇన్వెస్టర్లు అన్వేషించేలా చేస్తున్నాయి. ఈ క్రమంలో ముందుగా కనిపిస్తున్నవి ఫిక్స్‌డ్ డిపాజిట్లే. కానీ దేశ జీడీపీ వృద్ధిరేటు గురించి ఆలోచిస్తున్న ఆర్బీఐ.. ద్రవ్యోల్బణం విజృంభిస్తున్నా ఓపికతోనే ఉంటున్నది. అయితే ప్రతికూల పరిస్థితులు వడ్డీరేట్ల పెంపునకే ఆర్బీఐని ఉసిగొల్పుతున్నాయని చెప్పడంలో ఎంతమాత్రం అతిశయోక్తి లేదు. ఈ క్రమంలోనే సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో బ్యాంకులు ఆయా కాలపరిమితుల ఎఫ్‌డీలపై వడ్డీరేట్లను పెంచేందుకు వీలుందంటున్నారు.

